

'అనంత' సాంకేతిక 'దీప్తి'

జేఎన్‌టీయూ (ఏ) 13వ స్నాతకోత్సవం శనివారం జరగనుంది. చాన్స్‌లర్ హోదాలో ముఖ్య అతిథిగా జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. 8లో



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
31.9°/19.8°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. పగలు ఆకాశం మేఘావృతమైంది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాక

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం పుట్టపర్తికి విచ్చేయనున్నారు. పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు వివిధ సంక్షేమ వసతి గృహాల అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఎంఈఓలు, ప్రైవేటు స్కూల్ నిర్వాహకులతో సమీక్ష నిర్వహిస్తారని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తెలిపారు. మధ్యాహ్నం బుక్కపట్నం డైట్ కళాశాలలో విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. అనంతరం సాయంత్రం పుట్టపర్తిలోని హ్యాపీ హోం చైల్డ్ కేర్‌ను సందర్శిస్తారని పేర్కొన్నారు. రాత్రికి పుట్టపర్తిలో బస చేస్తారని తెలిపారు. 6వ తేదీ మడకశిరలో రివ్యూ మీటింగ్, కేజీబీవీ పాఠశాల , జెడ్పీహెచ్ పాఠశాలల పరిశీలన, సాయంత్రం హిందూపురంలోని వసతి గృహాలు, బాలసదన్‌లను సందర్శిస్తారని వెల్లడించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ

నల్లచెరువు: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయాన్ని డీఈఓ మీనాక్షి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పాఠశాలల్లో అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్‌నాయక్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరోసారి జెడ్పీ సమావేశం వాయిదా



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం మళ్లీ వాయిదా పడింది. ఈ మేరకు జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ/జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. డిసెంబర్ 26న జరగాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశం 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమం కారణంగా వాయిదావేయాల్సి వచ్చిందన్నారు. తిరిగి ఈ నెల 5న నిర్వహించాలని నిర్ణయించగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల అమలులో భాగంగా ద్వైవార్షిక నగదు పంపిణీ కార్యక్రమం దృష్ట్యా సమావేశాన్ని మరోసారి వాయిదా వేసినట్లు వివరించారు. తదుపరి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

టీబీ డ్యాంలో 10 టీఎంసీల నీరు

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద ఉన్న టీబీ డ్యాంలో 10.254 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు. గురువారం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో జీరోగా నమోదైంది. నీటి మట్టం 1,589.05 అడుగులకు తగ్గింది. గతేడాది ఇదే సమయానికి 1,623.91 అడుగులతో 72.982 టీఎంసీల నీరు నిల్వ ఉండింది. 8,551 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది. జలాశయంలో నీటి లభ్యత లేకపోవడంతో హెచ్చెల్సీకి నీటిని ముందుస్తుగానే నిలిపివేసిన విషయం తెలిసిందే.

ఆంజనేయుడి సేవలో బిందు మాధవి

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామిని హీరోయిన్ (బిగ్ బాస్ ఓటీటీ విన్నర్) బిందు మాధవి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులకు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ విశిష్టత తెలియజేసి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా బిందు మాధవి మాట్లాడుతూ మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైతులు పాడిపంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుడిని వేడుకున్నట్లు చెప్పారు. స్వామిని దర్శించుకున్న తర్వాత మానసిక ప్రశాంతత కలిగిందన్నారు. ఆమె వెంట బిందు మాధవి తండ్రి, ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.



హీరోయిన్ బిందు మాధవికి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

మురిపించిన కానుక

జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ పండుగలా సాగుతోంది. రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచిన పింఛన్లను అన్నిచోట్లా ప్రజాప్రతినిధులు, వలంటీర్లు లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఇంటికి పెద్ద కొడుకులా, తోబుట్టువులా సీఎం జగన్ అండగా ఉండి అన్ని విధాలా తమకు భరోసా ఇస్తున్నారంటూ పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను పెంచి తమ బతుకుల్లో వెలుగునింపిన జగనన్నను మరోసారి ఆశీర్వదిస్తామని చెబుతున్నారు.

- జిల్లాలో పండుగలా సాగుతున్న పింఛన్ పంపిణీ
- పెంచిన పింఛన్ చేతికి అందడంతో లబ్ధిదారుల హర్షం
- చేసిన మంచిని మర్చిపోవద్దంటున్న ప్రజా ప్రతినిధులు



నల్లమాడలో రూ.3 వేలు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



తనకల్లు: లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పేదల ఇళ్లలో సంతోషాలను నింపుతోంది. జిల్లా వ్యాప్తంగా పింఛన్ పంపిణీ కార్యక్రమాలు పండుగలా సాగుతున్నాయి. గ్రామసభలకు ఉదయం నుంచే వృద్ధులు, వికలాంగులు పెద్ద ఎత్తున విచ్చేస్తూ సంబరాల్లో పాల్గొని తామంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని చెబుతున్నారు. ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడంతో పాటు కొత్త పింఛన్లు సైతం అందజేస్తుండటంతో ఇళ్లలో ముందస్తుగానే సంక్రాంతి పండుగను చేసుకుంటున్నారు. జిల్లాలోని 2,75,844 మంది పింఛన్‌దారులకు ప్రభుత్వం రూ.82.37 కోట్లు మంజూరు చేసింది.

❒ పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. మధ్యాహ్నం ఓడీసీలోని ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ సంబరాలను నిర్వహించారు. అనంతరం నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చేసిన మంచిని మరువకుండా వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు.

❒ కదిరి నియోజకవర్గంలోని తనకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక సంబరాల్లో ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొన్నారు. పెద్ద ఎత్తున విచ్చేసిన లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేశారు. చెప్పిన మాటను తప్పకుండా పింఛన్ మొత్తాన్ని పెంపుచేసి సీఎం జగన్ అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

❒ మడకశిర నియోజకవర్గంలోని మడకశిర మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని పాల్గొని పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. మడకశిర నియోజకవర్గంలో వేలాది మందికి జగనన్న సహకారంతో పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కృతజ్ఞతగా వచ్చే ఎన్నికల్లో జగనన్నను అత్యధిక ఎమ్మెల్యే సీట్లలో గెలిపించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు.

❒ హిందూపురం మండలం కిరికెర పంచాయతీలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేసి సంబరాలను ప్రారంభించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా పింఛన్ మొత్తం రూ.3 వేలు ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మరోసారి ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు.



హిందూపురం మండలం కిరికెర పంచాయతీ వీవర్స్‌కాలనీలో పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



అమరాపురం మండలం ఆలదపల్లిలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ యోగేష్



తలుపుల మండలం వీరప్పగారిపల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద కొడుకులా మా కుటుంబానికి అండగా నిలబడ్డారు. చెప్పిన మాట తప్పకుండా పింఛన్‌ను రూ.3 వేలు చేశారు. ఇంతకంటే మాకేం కావాలి. ఎవరి మీద ఆధార పడకుండా చేశారు. చాలా ఆనందంగా ఉంది. నా ప్రాణం ఉన్నంత వరకు జగన్‌కే మా మద్దతు. మాలాంటి వృద్ధులను గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటాం.

–చెన్నకృష్ణప్ప, కల్లూరు, లేపాక్షి మండలం

సీఎం జగన్ మేలును మరువం



ఇచ్చిన మాట నిలుబెట్టుకొన్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. పింఛన్‌లు విడతల వారీ పెంచుతూ నేడు వలంటీర్ ద్వారా రూ.3 వేలు చేతికి ఇచ్చారు. గతంలో పింఛన్ పొందాలంటే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పంచాయతీ కార్యాలయాల ముందు తిండి తిప్పలు లేక కూర్చోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి తలుచుకొంటేనే భయమేస్తోంది. వితంతువునైన నాకు రాష్ట్ర ప్రభుత్వమిస్తున్న ఈ పింఛన్ డబ్బులే జీవనాధారంగా మారాయి. సీఎం జగన్ మేలును ఎన్నటికీ మరువలేం.

– బి.లక్ష్మమ్మ, గోళ్లాపురం, హిందూపురం మండలం

ఇప్పుడు ఏ ఇబ్బందీలేదు



జగనన్న చెప్పిన విధంగానే సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారు. వలంటీర్ వచ్చి నాకు మంజూరైన రూ.3 వేలను అందించారు. చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు ఎవరిపైనా ఆధారపడనవసరంలేదు. పింఛన్ డబ్బుతో ఆనందంగా జీవించవచ్చు. పేదల గురించి ఆలోచించి పక్కాగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం జగనే.

– షేక్ సరయా, పెనుకొండ

విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

పెనుకొండ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని ఆర్అండ్‌బీ, స్పోర్ట్స్, యూత్, ట్రాన్స్‌పోర్ట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రటరీ క్రీడాకారులతో మాట్లాడారు. ఆయన వెంట కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, ఆర్డీఓ కరుణాసాగర్ పాల్గొన్నారు. ముందుగా షటిల్ క్రీడను ప్రారంభించిన ఆయన క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రద్యుమ్న మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. గ్రామీణ క్రీడాకారులు 'ఆడుదాం ఆంధ్రా'ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ , సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ కొంత సేపు షటిల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. తర్వాత ప్రిన్సిపాల్ సెక్రటరీ కొండరోడ్డును పరిశీలించారు.

ఇంజినీర్లకు ప్రశంసలు

పట్టణంలోని కొండ రోడ్డును పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న రోడ్డు నిర్మాణ తీరు ఎంతో అద్భుతంగా ఉందని ఇంజినీర్లు, సిబ్బందిని ప్రశంసించారు. కొండపైన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పరిశీలించి అక్కడే ఉన్న కోనేరును తిలకించారు. సమీపంలో చదును చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఇస్కాన్ నేతృత్వంలో నిర్మాణమయ్యే ఘనగిరి లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ నిమిత్తం ఇస్కాన్ ప్రతినిధులు నేలను చదును చేసారని అధికారులు వివరించారు. ఇంజినీరింగ్ అధికారులతో కాసేపు ముచ్చటించి నేరుగా జాతీయ రహదారిపై ఉన్న రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆన్‌లైన్ విధానం గురించి ఎంవీఐ రవీంద్ర నాయక్‌ను అడిగారు.



షటిల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు

పుట్టపర్తి అర్బన్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే తమ లక్ష్యమని డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మైనుద్దీన్‌తో కలిసి డీఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం తెలిపిన పలు విషయాలను ప్రతినిధులకు వివరించారు. ఫారం 6, 7, 8, 9 ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపులకు సంబంధించి వివరాలను వివరించారు. జిల్లాలో 2022 డిసెంబర్ 26 నుంచి 2023 డిసెంబర్ 10 వరకూ అన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన క్లైముల్లో ఫారం-6 కు 92,035 క్లైములు స్వీకరించగా 81,804 పరిష్కరించడం జరిగిందన్నారు.10,227 తిరస్కరించినట్లు చెప్పారు. ఫారం -7కు సంబంధించి 62,227 క్లైములు రాగా 48,546 పరిష్కరించి 13,660 తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఫారం-8 కు సంబంధించి 60,660 క్లైములు రాగా అందులో 57,333 పరిష్కరించామన్నారు. 3,311 తిరస్కరించినట్లు వివరించారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం అమలు తీరుపై హౌసింగ్ డీఈ, ఏఈలు, వివిధ ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, హౌసింగ్ ఓఎస్‌డీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రషీద్‌ఖాన్, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, మెప్మా అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు స్పెషల్ డ్రైవ్‌లో పురోగతి చూపించాలన్నారు. మెగా డ్రైవ్‌లో భాగంగా జనవరి 30 నాటికి ఇప్పటికే ప్రారంభమైన 20,965 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ధర్మవరం, హిందూపురం, మడకశిర, కదిరి నియోజక వర్గాల్లో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమ శిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఆప్షన్ 3 కింద సుమారు 6,919 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. వీటి నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 65,629 ఇళ్ల ను మంజూరు చేసిందన్నారు. ఇందులో ప్రారంభ దశలో 19,723, పునాది దశలో 16,214, గోడల దశలో 4217, పైకప్పు దశలో 2484 ఇళ్లు ఉన్నాయన్నారు. కొన్ని గృహాలను ఇప్పటికే ప్రారంభించినట్లు చెప్పారు.

అట్టహాసంగా 'స్పోర్ట్స్ మీట్'



పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి. చిత్రంలో ఎంపీ రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం: స్థానిక జేఎన్‌టీయూ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం 26వ ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్, గేమ్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 6వ తేదీ వరకు కొనసాగనున్న క్రీడా పోటీలకు 26 జిల్లాల నుంచి 1,400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వాలీబాల్, టెన్నిస్ పోటీలను నాగరాణి, గౌతమి ప్రారంభించారు. క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎంపీ రంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు అనంతపురం వేదికగా నిర్వహించడం గర్వకారణమన్నారు.

డౌటెవరు.. ఔటెవరు?

- టికెట్లపై టీడీపీ సీనియర్లలో నిరాశ
- రెండు జిల్లాల అధ్యక్షుల్లో ఆందోళన
- అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం మల్లగుల్లాలు
- బాబు నాన్చుడు ధోరణే కొంప ముంచుతోందంటున్న నాయకులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పరుగులు పెట్టిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు పెద్దపీట వేస్తూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతోంది. ప్రతిపక్ష తెలుగుదేశంలో మాత్రం ఈ విషయంలో గందరగోళం నెలకొంది. గెలుపు గుర్రాలేవో, కుంటి గుర్రాలేవో తేల్చుకోలేక సతమతమవుతోంది. సీట్లు ఎవరికి ఇవ్వాలో తెలీక తలపట్టుకుంటోంది. ఈ నాలుగున్నరేళ్లూ చురుకైన పాత్ర పోషించడంలో సీనియర్ నాయకులు ఘోరంగా విఫలమైన నేపథ్యంలో మళ్లీ వారికి టికెట్లిస్తే పుట్టి మునుగుతుందేమోనన్న ఆలోచనలో అధిష్టానం ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

వీళ్లకు ఈసారి డౌటే..?

కొంతమంది సీనియర్ నాయకులకు ఈసారి టికెట్లు ఇవ్వడానికి అధిష్టానం నిరాకరిస్తోంది. ఇందులో తొలి వరసలోకి రెండు జిల్లాల పార్టీ అధ్యక్షులు ఉన్నట్టు తెలిసింది. కాలవ శ్రీనివాసులు రాయదుర్గంలో కచ్చితంగా ఓడిపోతారని, అందుకే పార్లమెంటుకు పంపించాలని ఆలోచిస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథిని కూడా పెనుకొండ అసెంబ్లీ కాకుండా హిందూపురం పార్లమెంటుకు పోటీ చేయించాలన్న యోచనలో ఉన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను అక్కడ నుంచి తప్పించి కృష్ణా జిల్లాకు పంపాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.



వీళ్లకు హుళక్కేనా?

గుంతకల్లులో జితేందర్‌గౌడ్‌ను తప్పించి మరొకరికి టికెట్ ఇవ్వాలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఇక.. శింగనమలలో బండారు శ్రావణికి టికెట్ అనుమానంగా ఉంది. ధర్మవరం టికెట్ రేసులో ఉన్న పరిటాల శ్రీరామ్‌కు నిరాశ ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో టీడీపీ తరఫున పోటీచేసి ఓడిపోయి, బీజేపీలో చేరిన వరదాపురం సూరిని తిరిగి పార్టీలో చేర్చుకొని టికెట్ ఇవ్వాలని ఉన్నారు. కళ్యాణదుర్గంలోనూ గతంలో పోటీచేసిన అభ్యర్థిని నిలపడం లేదు. అనంతపురం అర్బన్ టికెట్ ఈసారి ప్రభాకర్ చౌదరికి లేదని కరాఖండీగా చెప్పినట్టు తెలుస్తోంది. కదిరిలో కందికుంట ప్రసాద్‌కు చెక్ బౌన్స్ కేసులో శిక్ష పడిన నేపథ్యంలో ఆయన భార్యకు టికెట్ ఇస్తే గెలుస్తుందా అన్న అనుమానంలో అధినాయకత్వం ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ అభ్యర్థుల ఎంపిక గందరగోళంగా ఉందని తెలుగుదేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు వాపోతున్నారు. చంద్రబాబు నాన్చుడు ధోరణి తమ మెడకు పాములా చుట్టుకుంటోందంటూ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

రూ.20 కోట్లు ఎక్కడ తేవాలి?

ఇటీవల జిల్లాలోని టీడీపీ ఓ నియోజకవర్గ నేత టికెట్ కోసం ప్రయత్నించగా రూ.20 కోట్లు ఉంటే చూపించు టికెట్ ఆలోచిస్తాం అని అధిష్టానం చెప్పినట్లు తెలిసింది. రూ.20 కోట్లు రెడీ చేసుకుంటేనే టికెట్ ఇస్తామని, లేదంటే వేరే ఆలోచిస్తామని తెగేసి చెప్పడంతో చాలామంది నాయకులు బెంబేలెత్తుతున్నారు. రిజర్వుడు నియోజకవర్గ అభ్యర్థులకు కూడా డబ్బు రెడీ చేసుకుంటేనే టికెట్ ఉంటుందని చెబుతుండటంతో పోటీకి ముందుకొచ్చే అభ్యర్థులు కూడా వెనకడుగు వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చావు దెబ్బ కొట్టింది. అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ సంక్షేమ రథాన్ని పరుగులు పెట్టిస్తుండడంతో ఇప్పటికీ కోలుకోలేదు. ఈ క్రమంలోనే చంద్రబాబు వైఖరితో పార్టీ పరిస్థితి పూర్తిగా కనుమరుగైపోయే దశకు చేరుకుంటోందని ఆ పార్టీ కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు నిట్టూరుస్తున్నారు.

క్లుప్తంగా

అధిష్టానం నిర్ణయం శిరోధార్యం



● ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ: అధిష్టానం నిర్ణయం మేరకే నడుచుకుంటానని ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. బుధవారం గోరంట్లలో జరిగిన ఓ సమావేశంలో తాను అధిష్టానం నిర్ణయాన్ని ధిక్కరించేలా మాట్లాడినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అంశాన్ని ఖండించారు. గురువారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ...తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినా సోషల్ మీడియాలో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, పార్టీ పెద్దల ఆశీర్వాదంతోనే తనకు ఎమ్మెల్సీ పదవి దక్కిందన్నారు. ఈ రాజకీయ భిక్షను ఏనాటికీ మరువబోనన్నారు.

'నీటి అవగాహనే రాయలసీమకు రక్ష' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి రచించిన 'నీటి అవగాహనే రాయలసీమకు రక్ష' పుస్తకాన్ని హిందూపురంలోని ఇందిరా పార్కులోని కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద గురువారం ఆవిష్కరించారు. జలసాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ... రాయలసీమ కరువు పరిస్థితుల నుంచి బయటపడాలంటే ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని అందించడమే పరిష్కార మార్గమన్నారు. ఈ క్రమంలో రాయలసీమ నీటి ప్రాజెక్టులపై విధానాలను ప్రకటిస్తూ ఎన్నికల ప్రణాళికలో స్పష్టం చేయాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. శ్రీ బాగ్ ఒడంబడికను అమలు చేయాలని, హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేసి ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలని కోరారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేసి అన్ని చెరువులూ నింపాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, అహుడా మాజీ చైర్మన్ అంబికా లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకుడు బాలాజీ మనోహర్, జలసాధన సమితి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రచయిత సడ్లపల్లి చిదంబర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, అరసం సభ్యుడు గంగిరెడ్డి, గంగాధర్, నాయకులు జమీల్, ఆదినారాయణ, నవీన్, జయరామిరెడ్డి, జేవీవీ రామకృష్ణ, న్యాయవాదులు, శివశంకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'అనంత' సాంకేతిక 'దీప్తి'

- జేఎన్‌టీయూ(ఏ) 13వ స్నాతకోత్సవం రేపు
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న చాన్సలర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్
- విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ వర్సిటీ మాజీ వీసీ డాక్టర్ బాల వీరారెడ్డికి గౌరవ డాక్టరేట్
- 86,142 మంది విద్యార్థులకు డిగ్రీలు, 265 మందికి పీహెచ్‌డీల ప్రదానం



స్నాతకోత్సవానికి ముస్తాబైన జేఎన్‌టీయూ (ఏ) ఆడిటోరియం

అనంతపురం: కరువు సీమలో కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూ (అనంతపురం) మరో స్నాతకోత్సవానికి సిద్ధమైంది. ఎంతో మంది శాస్త్రవేత్తలు, ఇంజినీరింగ్ నిపుణులను సమాజానికి అందించిన జేఎన్‌టీయూ (ఏ) 13వ స్నాతకోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. సమాజహిత పరిశోధనలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్న సాంకేతిక విశ్వవిద్యాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

బంగారు కొండలు వీరే

2021-22 బ్యాచ్‌కు సంబంధించి జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బి. మేఘనకు నాలుగు బంగారు పతకాలు, వి. చైతన్య రెండు బంగారు పతకాలు, సీబీ సాయికుమార్ ఐదు బంగారు పతకాలు, దాసరి నిర్ణీత మూడు బంగారు పతకాలు, కొండాసాయి తనూజ రెండు బంగారు పతకాలు, మేడా గురు సంతోష్ కుమార్ ఒక బంగారు పతకం, ఎం. సాయి ఉపేంద్రారెడ్డి రెండు బంగారు పతకాలు దక్కించుకున్నారు. అలాగే 2022-23 బ్యాచ్‌కు సంబంధించి... జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన దాసరి శాంతి ఏకంగా 8 బంగారు పతకాలు దక్కించుకుంది. ఇందులో బీటెక్ సివిల్ టాపర్స్, 1982 ఎండోమెంట్ బంగారు పతకం, చల్లా సుబ్బరాయుడు స్మారక బంగారు పతకాలు రెండు, కె.వెంకటేశ్వర రావు బంగారు పతకం, ప్రొఫెసర్ టీఎస్ రాఘవన్ స్మారక బంగారు పతకం, చుండుపల్లి వెంకటరాయలు, సరోజమ్మ స్మారక బంగారు పతకం, ప్రొఫెసర్ బి.విజయభాస్కర్ దేశాయ్ దంపతుల బంగారుపతకం ఉన్నాయి. అలాగే మరో విద్యార్థిని ఎం.నిత్యశ్రీ రెండు బంగారు పతకాలు, కె.వంశీ మూడు బంగారు పతకాలు, ఎస్.సుమంత్ రెండు బంగారు పతకాలు దక్కించుకున్నారు.

ప్రొఫెసర్ బాల వీరారెడ్డికి గౌరవ డాక్టరేట్



ప్రొఫెసర్ బాల వీరారెడ్డి

అనంతపురంలోని క్యాంపస్ కళాశాలలో 1958–1963లో బీటెక్ పూర్తి చేసిన బాలవీరారెడ్డి శనివారం పూర్వ విద్యార్థి హోదాలో గౌరవ డాక్టరేట్‌ను అందుకోనున్నారు. కర్ణాటక రీజనల్ ఇంజినీరింగ్ కళాశాల (ప్రస్తుతం నేషనల్ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ, సూరత్‌కల్, కర్ణాటక)లో పలు హోదాల్లో ఆయన పనిచేశారు. కర్ణాటక డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీకి రెండు దఫాలు వీసీగా పనిచేశారు. వివిధ అవార్డులు అందుకున్నారు. అలాగే 86,142 మంది విద్యార్థులకు డిగ్రీలు, 265 మందికి పీహెచ్‌డీలు ప్రదానం చేయనున్నారు.

అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన

అన్ని రంగాల్లోనూ జేఎన్‌టీయూ(ఏ)ను అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అందరినీ సమన్వయం చేసుకుని పనిచేస్తున్నట్లు ఆ వర్సిటీ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన అన్నారు. గురువారం ఆయన జేఎన్‌టీయూ(ఏ)లోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గౌరవ డాక్టరేట్‌ను ప్రొఫెసర్ బాలవీరారెడ్డికి అందజేయడం గర్వంగా ఉందన్నారు. స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా గవర్నర్/చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్, విశిష్ట అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్యవక్తగా పోలవరం ప్రాజెక్ట్ చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణరాజు హాజరవుతారన్నారు. మొత్తం 86,142 మందికి స్నాతకోత్సవ పట్టాలు అందించనున్నట్లు వివరించారు.

ఐఈఎస్ సాధించాలన్నదే లక్ష్యం



మాది పుట్టపర్తి. అమ్మ సావిత్రి. నాన్న నరసప్ప ఎలక్ట్రీషియన్‌గా ఉన్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో టాపర్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉంది. ఒకే దఫా 8 బంగారు పతకాలు దక్కించుకోవడం గర్వకారణం. ఇది వరకే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో టీసీఎస్, కాగ్నిజెంట్ కంపెనీల్లో మంచి ఆకర్షణీయమైన ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. అయినా ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ సాధించడమే నా లక్ష్యంగా వాటిని తిరస్కరించా. నా ఉన్నతికి సహకరించిన వర్సిటీ ప్రొఫెసర్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. ప్రత్యేకించి రిజిస్ట్రార్ శశిధర్ సార్ సహకారం మరువలేనిది.

– దాసరి శాంతి, 8 బంగారు పతకాల విజేత

శిక్షణ ఇవ్వడం ఉపయోగపడింది



పరిగి మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన నేను సాధారణ రైతు కుటుంబం నుంచే వచ్చాను. అమ్మ అలివేలమ్మ, నాన్న ఆనందప్ప వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏకంగా ఐదు బంగారు పతకాలు రావడం చాలా గర్వంగా ఉంది. ఫెయిల్ అయిన వారికి సాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తూ వచ్చాను. అదే నా ఈ విజయానికి కారణమైంది. ఈ స్ఫూర్తితో ఐఈఎస్ సాధిస్తాననే నమ్మకం కలిగింది.

– సీబీ సాయికుమార్, ఐదు బంగారు పతకాల విజేత

జనవాక్కు

ఆదుకున్నారు



ఎలాంటి ఆధారం లేని నాకు ప్రభుత్వం అందజేస్తున్న పింఛనే బతుకుతెరువు. గత టీడీపీ ప్రభుత్వం అకారణంగా నాకు వస్తున్న పింఛన్‌ను రద్దు చేసింది. దీంతో వయసు మీద పడిన నేను, రెండు కళ్లు లేని నా కుమారుడు... కుటుంబపోషణకు నానా అగచాట్లు పడ్డాం. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నా పింఛన్‌ను పునరుద్ధరించారు. అలాగే నా కుమారుడికి దివ్యాంగుల కోటా (అంధుడు)లో పింఛన్ మంజూరైంది. దీంతో మా ఆర్థిక ఇబ్బందులు తీరాయి. సీఎం వైఎస్ జగన్ ఎంతో మంచి మనసుతో పేదలను, నిస్సహాయులను ఆదుకుంటున్నారు. ఆయనే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

– ఆర్వేటి చంద్రమ్మ, గుడ్డంపల్లి, తాడిమర్రి

పది కాలాల పాటు జగనే సీఎం



నాకు భార్య లేదు. ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వారి సంపాదన వాళ్ల కుటుంబ అవసరాలకే సరిపోదు. ఇలాంటి పరిస్థితుల్లో నా బాగోగులు చూడడం వారికి మరింత భారమైంది. అలాంటి విపత్కర సమయంలో సీఎం వైఎస్ జగన్ మా కుటుంబాన్ని ఆదుకున్నారు. నాకు రైతు భరోసా కింద ఏటా రూ.13,500, ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ అందజేస్తున్నారు. ప్రస్తుతం ఎవరి మీద ఆధారపడకుండా గౌరవ ప్రదమైన జీవితం గడుపుతున్నా. సీఎం వైఎస్ జగన్ మరో పది కాలాల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నా.

– ఆదినారాయణ, మైదుగోళం, లేపాక్షి మండలం

కంటి చూపు బాగుపడింది



గుమాస్తా పనితో జీవనం సాగించే నేను కంటి చూపు మందగించడంతో నానా ఇబ్బందులు పడ్డాను. తప్పిదాలు జరగకూడదని పని మానేశా. మూడు నెలల క్రితం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద వైద్య శిబిరంలో డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వహించి, అనంతపురంలోని ఆస్పత్రికి పిలుచుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేశారు. కంటి అద్దాలతో పాటు, మందులు ఉచితంగా ఇచ్చారు. రానుపోనూ చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లించింది. ఇప్పుడు నా కంటి చూపు బాగుపడింది. పేదల అవసరాలు గుర్తించి ఎప్పటికప్పుడు తీరుస్తున్న సీఎం వైఎస్ జగన్ పాలన ఎంతో బాగుంది. ఆయనకు మేమెంతో రుణపడి ఉన్నాం.

– ఇమామ్‌సాహెబ్, తిలక్‌నగర్, గుంతకల్లు

జిల్లాలో విస్తృతంగా 'సెబ్' తనిఖీలు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా సెబ్ అధికారులు గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా దిగుమతి చేసుకుని విక్రయాలు సాగిస్తున్న వారితో పాటు నాటు సారా తయారీదారులను గుర్తించి 13 కేసులు నమోదు చేశారు. ధర్మవరం సెబ్ స్టేషన్ పరిధిలో 2 కేసులు నమోదు చేసి, 375 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ కేసుల్లో నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కదిరి సెబ్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదు చేసి, 6 లీటర్ల బెల్లం ఊట, హిందూపురం సెబ్‌స్టేషన్ పరిధిలో 2 కేసులు నమోదు చేసి, 100 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. తూముకుంట చెక్‌పోస్టు వద్ద 107 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. పుట్టపర్తి సెబ్ స్టేషన్ పరిధిలో 25 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం, సీకేపల్లి సెబ్ స్టేషన్‌లో 35 ప్యాకెట్లు, పెనుకొండ సెబ్ స్టేషన్ పరిధిలో 40, తనకల్లు సెబ్ స్టేషన్ పరిధిలో 40 మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

గార్లదిన్నె: ఆటో బోల్తాపడిన ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వివరాలు.... గురువారం ఉదయం అనంతపురం నుంచి ప్రయాణికులతో పామిడికి బయలుదేరిన ఆటో... గార్లదిన్నె మండలం రామదాసుపేట వద్దకు చేరుకోగానే రోడ్డుపై అడ్డంగా బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న పోతన్న, ఫరీదా, హసీనా, వెంకటలక్ష్మి, షబానతో పాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జీజీహెచ్‌కి తరలించి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దేశానికి తలమానికంగా నిలవాలి : ప్రద్యుమ్న



వాలీబాల్‌ను ప్రారంభిస్తున్న ప్రద్యుమ్న

చిలమత్తూరు: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు దేశానికే తలమానికంగా నిలిచేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న అన్నారు. గురువారం చిలమత్తూరులో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జేసీ అభిషేక్‌కుమార్, సబ్ కలెక్టర్ భరత్, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం



రామకృష్ణ (ఫైల్)

పావగడ: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం ఆర్.అనంతపురం గ్రామానికి చెందిన బోయ రామకృష్ణ(30)కు భార్య విజయలక్ష్మి, ఓ కుమార్తె ఉన్నారు. బుధవారం రాత్రి పావగడలో పని ముగించుకుని స్వగ్రామానికి తన మోపెడ్‌పై తిరుగు ప్రయాణమైన ఆయన... తాలూకా పరిధిలోని దొమ్మతమరి గ్రామం వద్ద ఉన్న సొప్పులమ్మ గుడి వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ఉడాయించాడు. సమాచారం అందుకున్న సీఐ నగేష్ పరిశీలించి, కేసు నమోదు చేశారు.

విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కిటకిట!

గుంతకల్లు: భవానీ దీక్ష విరమణను పురస్కరించుకుని మాలాధారులతో విజయవాడ వైపుగా వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు కిటకిటలాడుతున్నాయి. అనంత జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వేలాది మంది భవానీ మాలను ధరించారు. ఈ నెల 3 నుంచి దీక్షాపరుల ఇరుముడి సమర్పణ మొదలైంది. ఈ నేపథ్యంలో గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాలోని భవానీ దీక్షాపరులతో పాటు కర్నూలు జిల్లా ఆలూరు, పత్తికొండ నియోజకర్గాల్లోని దీక్షాపరులు గుంతకల్లు జంక్షన్ మీదుగా విజయవాడకు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో బెంగుళూరు-భువనేశ్వర్ (ప్రశాంతి ఎక్స్‌ప్రెస్), హుబ్లీ-విజయవాడ, వాస్కోడిగామా-విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిస్తున్నాయి. సంక్రాంతి సెలవుల నేపథ్యంలోనూ రిజర్వేషన్ల వెయిటింగ్ లిస్ట్ భారీగా పెరిగింది.

ఆగ్రోస్ ఆస్తుల జప్తు

అనంతపురం అగ్రికల్చర్: ఏపీ ఆగ్రోస్ అనంతపురం కార్యాలయ ఆస్తులు అమ్మడానికి, కొనడానికి వీలు లేదని లేబర్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ విశ్రాంత అధికారి ఈశ్వరరెడ్డి 'సాక్షి'కి గురువారం వెల్లడించారు. 1997లో ఆగ్రోస్ కార్యకలాపాలపై వచ్చిన అభియోగాలకు తనతో పాటు మరో ఐదుగురిని సస్పెండ్ చేశారన్నారు. రెండు సంవత్సరాల పాటు సాగిన శాఖ పరమైన విచారణలో కొందరు వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోగా మరో ఇద్దరికి ఇంక్రిమెంట్లు కట్ చేసి ఉద్యోగంలోకి తీసుకున్నారని గుర్తు చేశారు. తనకు అన్యాయం చేస్తూ ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. ఈ అన్యాయంపై 2000 సంవత్సరంలో అనంతపురం లేబర్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశానని, దీనిపై 2003లోనే తనకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చిందన్నారు. ఈ అంశాన్ని సవాల్ చేస్తూ సంస్థ యాజమాన్యం హైకోర్టుకు అప్పీల్ చేసి, 2016లో పిటీషన్‌ను వెనక్కు తీసుకుందని వివరించారు. ఈమధ్యలో 2014లో తన పదవీకాలం ముగియడంతో ఉద్యోగ విరమణ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో తనకు అందాల్సిన బెనిఫిట్స్‌పై 2020లో మరోసారి లేబర్‌కోర్టును ఆశ్రయించడంతో ఆస్తులను జప్తు చేస్తూ న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించిందన్నారు.